నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 4 మే 2024 | SURYAPET

## కేసీఆర్ సాగు నీళ్లు ఇస్తే.. కాంగ్రెస్ కన్నీళ్లు తెప్పించింది



తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ అన్ని చెరువుల్లోకి నీళ్లు తెస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే రైతుల కండ్లలో కన్నీళ్లు తెచ్చింది. 14 ఏండ్లు కష్టపడి రైతు బిడ్డగా వ్యవసాయాన్ని పండుగగా మార్చితే కాంగ్రెస్ ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించేలా చేస్తున్నది. రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు ఇచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకున్నది. 1.12 కోట్ల ఎకరాలకు సాగునీరు ఇచ్చి 3కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించింది. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా క్వింటాల్ ధాన్యానికి 500 రుపాయల బోనస్ ఇస్తానని చెప్పి పైసా కూడా ఇవ్వలేదు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. ఒక్కసారి అవకాశం ఇచ్చి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలి.

–బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

# వాళ్లది పదవుల యావ
# మాది అభివృద్ధి ధ్యాస

కోమటిరెడ్డి, ఉత్తమ్ ఇంట్లో రెండేసి పదవులు, జానా ఇంట్లో రెండు పదవులు కావాలట

మంత్రులుగా, ఎంపీలుగా వాళ్లు చేసిందేమీ లేదు

- పదవుల కోసమేనా వాళ్లు పోటీ పడి రేవంత్ దగ్గర బూట్లు నాకుతున్నారు
- వాళ్ల జోడు పదవులకు చెక్‌పెట్టి ప్రశ్నించే గొంతుకను గెలిపించండి
- హామీలు అమలు చేయకుండా దేవుళ్లపై ఒట్లతో రేవంత్ కాలయాపన
- ధరలు పెంచి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టిన బీజేపీ
- బీఆర్ఎస్ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేయండి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సొంత ఊరికి నీళ్లివ్వలేని చరిత్ర జానారెడ్డిది : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చండూరు, నల్లగొండలో బీఆర్ఎస్ రోడ్ షో.. పెద్ద ఎత్తున హాజరైన జనం



నల్లగొండ బీఆర్ఎస్ రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నల్లగొండ/నీలగిరి/చండూరు, మే 3 : ఎంతో ఉద్యమ చరిత్ర కలిగిన నల్లగొండ జిల్లా అభివృద్ధిని పట్టించుకోకుండా పదవుల మీద యావతో గాలికి వదిలేసిన చరిత్ర జానారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రెడ్డిది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి, నల్లగొండ ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం శుక్రవారం ఆయన చండూరు, నల్లగొండలో రోడ్ షో నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 30 ఏండ్ల పాటు నల్లగొండను ఏలిన ఈ నలుగురు పదవుల కోసం ఆంధ్రోళ్ల దగ్గర మోకరిల్లారని, దాంతో జిల్లా అభివృద్ధి జరుగలేదన్నారు. జానారెడ్డి, కోమటిరెడ్డి నల్లగొండ, సూర్యాపేటకు మెడికల్ కాలేజీలు ఎందుకు తేలేదని, వారికి కానిది జగదీశ్‌రెడ్డితో ఎందుకు సాధ్యమైందని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలలతో పాటు ఐటీ హబ్, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ తెచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని చెప్పారు. కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంట్లో రెండు పదవులు ఉంటే, జనారెడ్డి ఇంట్లో ఒకే పదవి ఉందని ఇంకో కొడుకుకు పదవి కావాలని తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు. పొద్దున లేస్తే రేవంత్ రెడ్డి బూట్లు నాకుతూ కేసీఆర్‌ను తిట్టే కోమటిరెడ్డి ఆసరా పింఛన్ రూ.4వేలు ఎందుకు ఇస్తలేదని, రైతు బంధు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఉద్యమం అంటే ఏంటో తెలియని రేవంత్ సీఎం అయ్యాడని, ఆయన ఏ ఒక్క రోజన్నా ఉద్యమం చేసిండా అని విమర్శించారు. ఇదే నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఎన్నో ఉద్యమాలు జరుగటం వల్లనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే జానారెడ్డి ఇంట్లో ఒక ఉద్యోగం వస్తది తప్ప నల్లగొండ ప్రజల సమస్యలు ప్రశ్నించే అవకాశం ఉండదన్నారు. కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపిస్తే ఆయన పార్లమెంట్‌లో, తాము అసెంబ్లీలో గొంతెత్తి ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రభుత్వం మెడలు వంచుతామని చెప్పారు.

### మచ్చలేని మనిషి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో కంకర దొంగలు, భూ కబ్జాదారులు, ఇసుక దొంగలు ఉన్నారని, బీఆర్ఎస్‌లో మాత్రం ఉద్యమకారులు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లో కొంతమంది మంత్రులు ఆగుతలేరని, గాల్లో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులను భూమి మీద ఉంచాలంటే క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతుందని, అక్కాచెల్లెళ్లలకు కాంగ్రెస్ పార్టీ 10 వేల రూపాయలు బాకీ పడ్డదని అన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పుడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం రామన్న మీద, యాదగిరిగుట్టలో నరసన్న మీద, వేములవాడలో రాజన్న మీద ఒట్టేసి ఆరు గ్యారెంటీలతో పాటు రుణమాఫీ చేస్తానని ఒట్లు వేస్తున్నాడని చెప్పారు. ఆగస్టు 15 లోపు రైతులకు రుణమాఫీ చేయకుంటే రాజీనామా చేస్తానని తాను సవాల్ చేశానని తెలిపారు. రాహుల్ గాంధీ సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తి కిరణ్ కుమార్ రెడ్డికి రేవంత్ రెడ్డి ఎందుకు ఎంపీ టికెట్ ఇచ్చారో చెప్పాలన్నారు. కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క మంచి పని కూడా చేయలేదని చెప్పారు. నిత్యావసర సరుకులతోపాటు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట మీద ఉండే కేసీఆర్ అభివృద్ధిలో భాగంగా చండూరును రెవెన్యూ డివిజన్ చేశారని తెలిపారు. మునుగోడు ప్రాంతానికి రూ.570 కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేశారని చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కొత్త పథకాలు రాలేదని, ఉన్న పథకాలు ఊడిపోతున్నాయని అన్నారు. ప్రజలు ఆలోచించాలని, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ తెల్ల కాగితం లాంటివాడని, మచ్చలేని నాయకుడని, ఈ నెల 13న కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, మాజీ ఎంపీపీ పల్లె కళ్యాణి రవికుమార్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన జనంతోపాటు బీఆర్ఎస్ శ్రేణులతో చండూరు, నల్లగొండ పట్టణాలు గులాబీమయంగా మారాయి.



నల్లగొండ రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం

## ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా



'మంత్రులుగా పనిచేసిన జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి దామెదర్‌రెడ్డి నల్లగొండ జిల్లాలో చేసిన అభివృద్ధిపై, నేను మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం. జానారెడ్డి నియోజకవర్గం సాగర్‌లోనైనా, నా నియోజకవర్గం సూర్యాపేటలోనైనా, ఉమ్మడి జిల్లాకు వేదికగా ఉన్న క్లాక్‌టవర్ సెంటర్‌లోనైనా ఇందుకు రెడీగా ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో తమను తామే బొంద పెట్టుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన మోసాలను ప్రజలు అర్థం చేసుకుని పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. 35 ఏండ్లు జిల్లాను ఏలిన జానారెడ్డి జిల్లాకు చేసింది శూన్యం. కరువు కాటకాలను సృష్టించి ఫ్లోరైడ్‌తో ప్రజల నడుములు వంచారు. జిల్లా ప్రజలు ఆయనను తరిమేస్తే అడ్డదారిన కొడుకులను తీసుకొచ్చి అంతా తానే అభివృద్ధి చేశానని చెప్పడం విడ్డూరంగా ఉంది. 17 సంవత్సరాలుగా మంత్రిగా పనిచేసిన జానారెడ్డి సొంత గ్రామానికి నీళ్లు ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో రాజవరం మేజర్ లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి ఆ గ్రామ ప్రజలకు నీరిచ్చాం. నల్లగొండకు రూ.1500 కోట్లు, సూర్యాపేటకు రూ.1400కోట్లు, భువనగిరికి రూ. 1200కోట్లు అఖరి సాగర్ నియోజకవర్గానికి కూడా వందల కోట్ల రుపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేశాం. 50 ఏండ్లుగా సాగర్ నియోజకవర్గంలో సగం గ్రామాలకు నీరు లేదు. టెయిల్‌పాండ్ అని ప్రత్యేక పదం సృష్టించి ప్రజలకు అన్యాయం చేస్తే మేము వచ్చాక ఆ పదమే కనబడకుండా చేసి ప్రతి ఎకరాకు నీళ్లిచ్చాం. పదేండ్లలో ఎక్కడ కూడా ఎకరం పొలం ఎండలేదు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు ఎండబెట్టింది. సాగర్ నీళ్లు ఆంధ్రాకు తరలిపోతుంటే పదవులకు భయపడి నోరెత్తలేదు. జిల్లా నుంచి జానారెడ్డి పెద్ద పదవులు అనుభవించినా జిల్లాకు చేసినవి చిన్నపనులే. ఆయనకు, ఆ కుటుంబానికి ఓట్లడిగే అర్హత లేదు. ఎన్నికల్లో బీఆర్ఎస్ కటౌట్లు, బ్యానర్లు చింపి కార్యకర్తలను బెదిరిస్తున్నారు. నాయకులు పోయినా వందలాది కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు.'

–నల్లగొండ రోడ్ షోలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## కోమటిరెడ్డి బ్రదర్స్ మునుగోడు, భువనగిరికి చేసిందేమీ లేదు

కోమటిరెడ్డి బ్రదర్స్ వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి భువనగిరి, మునుగోడుకు చేసిందేమీ లేదు. స్వలాభాల కోసంరాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి గురించి ఏనాడూ వారు మాట్లాడరు. రాజగోపాల్‌రెడ్డి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించి తాను మంత్రి కావాలని ఆరాటపడుతున్నారు. అది కలగానే మిలిగి పోతుంది. ప్రజల్లో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. వడ్లు నానపోస్తే తాళ్ల గింజలులాగా ఉన్న వారిని నేడు పార్టీలో చేర్చుకుంటూ ఏదో తాము గెలవబోతున్నామని కాంగ్రెస్ నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారు. టైగర్ అని చెప్పుకునే వాళ్లు గడ్డి తింటూ నేడు ప్రజలకు గడ్డి పెడుతున్నారు. నల్లగొండ జిల్లాలో బడుగు బలహీన వర్గాల చెందిన బడుగుల లింగయ్య యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే యాదవులకు సముచిత స్థానం లభించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక యాదవ బిడ్డకు కూడా న్యాయం జరుగలేదు. ప్రజలందరి ఆశీర్వాదంతో నేను ఎంపీ అయి మీ తరపున పార్లమెంట్‌లో గొంతు వినిపిస్తా. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి.

– చండూర్ రోడ్ షోలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

## రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి కోసం భువనగిరిని తాకట్టు పెడుతున్నాడు

గతంలో గెలిచిన ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు జిల్లాకు ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. కోమటిరెడ్డి బ్రదర్స్‌ది రాజకీయ స్వార్థమే. మునుగోడు పౌరుషమున్న గడ్డ. చండూర్ రోడ్ షోకు ప్రజలు ఎంత అభిమానంతో వచ్చారో చూస్తుంటే కోమటిరెడ్డి బ్రదర్స్‌కు బీఆర్ఎస్ గెలుపు పక్కా అనే విషయం తెలియాలి. ప్రజలంతా ఆలోచించాలి. ప్రజలకు అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే తపన తప్ప కేసీఆర్‌కు వేరే ఆలోచన ఉండదు. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం భువనగిరి పార్లమెంట్ ప్రజలను తాకట్టు పెట్టాలని చూస్తున్నారు. కారు గుర్తుపై ఓటు వేసి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి.

–చండూర్ రోడ్ షోలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి




చండూరులో బీఆర్ఎస్ రోడ్ షోలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## ఫ్లెక్సీలు చించినంతమాత్రాన అభిమానాన్ని తుడుపలేరు

నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు, బ్యానర్లు కటౌట్లు చించినంత మాత్రన కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని తుడుపలేరు. నాయకులను కొనుగోలు చేసినంత మాత్రన బీఆర్ఎస్ కార్యకర్తలు ఎక్కడి పోలేదు. ప్రతి కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం. నా ప్రాణం ఉన్నంత వరకు ఈ గడ్డపై ఉంటా. 20 ఏండ్లు నల్లగొండను అభివృద్ధికి దూరం చేస్తే నేను రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశాను.

–నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



తుంగతుర్తిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగంధర్ రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్

# కాంగ్రెస్ పాలనలో ప్రజలు నరకం చూస్తున్నారు

- రైతులకు రైతు భరోసా జాడే లేదు
- రూ.4వేల పింఛన్ ఎక్కడ.. రెండు లక్షల రుణమాఫీ ఎప్పుడు?
- మరోసారి మోసపోకండి.. కారు గుర్తుకు ఓటేయండి
- క్యామ మల్లేశ్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం
- బీఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

తుంగతుర్తి, మే 3 : కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ప్రజలు నరకం చూస్తున్నారని, అనేక హామీలు ఇచ్చి ఆ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని, బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని, వారి మాయ మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు నీరందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కేసీఆర్ బస్సు యాత్రకు అనూహ్య రీతిలో ప్రజలు నీరాజనం పలుకుతుంటే ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి 48 గంటల ప్రచారాన్ని నిలిపివేశారని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ సర్కారు నీళ్లు ఇవ్వక పంటలు ఎండబెట్టిందని, 24గంటలు కరెంట్ కూడా ఇవ్వలేకపోతున్నదని మండిపడ్డారు. తుంగతుర్తి నియోజవకర్గంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి హయాంలో ఏ గ్రామానికి వెళ్లినా గోరీలే తప్ప అభివృద్ధి జరుగలేదని విమర్శించారు. గ్రామాల్లో ప్రస్తుతం కనీసం మంచినీటి సమస్య పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టడం లేదని అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని చెప్పారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఎవరినీ హింసించలేదని, ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టడం, దాడులు చేయడం తగదని అన్నారు. ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మొద్దని, ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సూర్యాపేట, యాదాద్రి జడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికా యుగంధర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు దొంగరి శ్రీను, గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు గౌడ్, తునికి లక్ష్మమ్మ, సత్యనారాయణగౌడ్, తడకమల్ల రవికుమార్, శ్రీకాంత్, వెంకటేశ్, మధు, దుర్గయ్య, శ్రీహరి, యాదగిరిగౌడ్, పూర్ణ నాయక్ పాల్గొన్నారు.

# రేపు నీట్

### నల్లగొండ జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలు
### హాజరుకానున్న 2,316 మంది విద్యార్థులు

రామగిరి, మే 3: వైద్య విద్య (ఎంబీబీఎస్, డెంటల్) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్–2024 ప్రవేశ పరీక్ష ఆదివారం జరుగనున్నది. ఇందుకోసం నల్లగొండ జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నల్లగొండ సిటీ కో ఆర్డినేటర్, నల్లగొండ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.పార్థసారధి శుక్రవారం వెల్లడించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30వరకు జరిగే పరీక్షలకు 2,316 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

### పరీక్ష కేంద్రాలు ఇవే..

- మౌంట్ ఫోర్ట్ సీబీఎస్‌సీ స్కూల్, దేవరకొండ రోడ్డు.. ఎస్పీఆర్ హైస్కూల్, రామగిరి.. నారాయణ స్కూల్, హైదరాబాద్ రోడ్డు..అరబిందో పబ్లిక్ స్కూల్, రవీంద్రనగర్.. న్యూస్ హైస్కూల్ యాటకన్నారెడ్డి కాలనీ.. ది నల్లగొండ పబ్లిక్ స్కూల్, మీర్‌బాగ్ కాలనీ.. విపస్య స్కూల్, చర్లపల్లి.

### విద్యార్థులు వీటిని పాటించాలి..

- విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 11గంటలకు చేరుకోవాలి. అదే సమయం నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.
- విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటోను హాల్ టికెట్‌లో చూపిన విధంగా అతికించి తీసుకురావాలి.
- ప్రతి విద్యార్థి ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలి. ఇతర ఏ ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు.



పట్టభద్రుల ఎమ్మెల్సీకి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న తీన్మార్ మల్లన్న, పక్కన మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్యేలు వీరేశం, లక్ష్మారెడ్డి

## పట్టభద్రుల ఎమ్మెల్సీకి రెండో రోజు ఐదుగురి నామినేషన్

నల్లగొండ, మే 3 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఉప ఎన్నికలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) 2 సెట్లు, అలియన్స్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఈడ శేషగిరి రావు 1 సెట్, తెలంగాణ సకలజనుల పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య 1 సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్ రెడ్డి 1 సెట్, చాలిక చంద్రశేఖర్ 2 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్ మహేందర్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

ఈ నెల 9 వరకు నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా 10న స్క్రూటినీ, 13న ఉపసంహరణ ఉంటుంది. తీన్మార్ మల్లన్న నల్లగొండలో భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. ఆయన వెంట రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు.

## బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



నల్లగొండలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమావేశంలో కలెక్టర్ హరిచందన

నల్లగొండ సిటీ, మే 3 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బ్యాలెట్ యూనిట్ల మొదటి విడుత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌ను శుక్రవారం నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన నిర్వహించారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా ఈవీఎంల బ్యాలెట్ యూనిట్ల రాండమైజేషన్‌ను ఈఎంఎస్‌ల సాఫ్ట్‌వేర్ ద్వారా చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్లగొండ, మిర్యాగూడ, దేవరకొండ ఆర్డీఓలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.